క్లుప్తంగా

ఉద్యోగులకు సేవలే గుర్తింపు



పాండుదొర దంపతులను సత్కరించిన బ్యాంక్ సిబ్బంది

గోకవరం: ఉద్యోగులకు సేవలే గుర్తింపును ఇస్తాయని గోకవరం స్టేట్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ దేవికా రాణి అన్నారు. గోకవరం స్టేట్ బ్యాంక్ బ్రాంచ్‌లో సీనియర్ హెడ్ మెసెంజర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన కత్రం పాండుదొర దంపతులను ఆదివారం బ్యాంక్ సిబ్బంది శాలువా, పూలమాలతో సత్కరించారు. పాండుదొర సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ హేమసుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి



ఆర్‌జేడీ శారదకు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ ప్రతినిధులు

రాజానగరం: రాజానగరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. గతంలో ఎప్పుడో ఒక కోఆపరేటివ్ కళాశాలను మంజూరు చేశారనే సాకుతో ప్రభుత్వం జూనియర్ కళాశాలను మంజూరు చేయకపోవడం పేద విద్యార్థుల పాలిట శాపంగా మారిందన్నారు. గతంలో మంజూరు చేసిన కోఆపరేటివ్ కళాశాల ఎక్కడ ఉందో కూడా తెలియదన్నారు. ఆ కళాశాల వలన పేద విద్యార్థులకు ఎటువంటి ప్రయోజనం చేకూరడం లేదన్నారు. కనుక ఈ విషయాన్ని లోతుగా పరిశీలించి, పేద విద్యార్థులకు మేలు చేకూర్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఆర్‌జేడీ శారదకు వినతిపత్రం అందజేశామని ఆయన తెలిపారు.

వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా సుధీర్



సత్యవరపు సుధీర్

మధురపూడి: వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం కోరుకొండ మండలాధ్యక్షుడిగా సత్యవరపు సుధీర్ నియమితులయ్యారు. ఇటీవల ఎమ్మెల్యే, పార్టీ అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో ఈ నియామకం జరిగింది. పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న సుధీర్‌ను పదవి వరించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, యువజన విభాగం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మిలకు సుధీర్ కృతజ్ఞతలు తెలిపారు.

సూర్యదేవునికి ప్రత్యేక పూజలు



జి.మామిడాడలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటైంది.

టెక్నికల్ ఆఫీసర్లకు గెజిటెడ్ హోదా కల్పించాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న నూతన కార్యదర్శి శ్రీనివాస్

రాజమహేంద్రవరం రూరల్: టెక్నికల్ ఆఫీసర్లకు గెజిటెడ్ హోదా కల్పించాలని ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌వీ సూర్యనారాయణరాజు, కార్యదర్శి ఎస్‌ఎల్ సోమయాజులు, కన్వీనర్ ఎం.ఏడుకొండలు విజ్ఞప్తి చేశారు. ఆ అసోసియేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశాన్ని బొమ్మూరు నరసింహరాజు కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని ఇంజినీరింగ్ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఆర్‌పీఎస్ 2018 సిఫారసు ప్రకారం టెక్నికల్ అసిస్టెంట్‌గా కారుణ్య నియామకాలను పునరుద్ధరించాలని కోరారు. తమ న్యాయపరమైన డిమాండ్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టికి త్వరలో తీసుకువెళతామన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా జి.వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా ఎం.శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.



బొబ్బిల్లంక వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి



వంగలపూడి వద్ద గోదావరి ప్రవాహం



బొబ్బిల్లంక - ములకల్లంక మధ్య బోటుపై రాకపోకలు

గోదారి ఉగ్రరూపం

- ముంపులోకి లంక భూములు
- అధికారుల అప్రమత్తం

సీతానగరం: అఖండ గోదావరి వరద ఉగ్రరూపం దాల్చుతోంది. నది ఆనుకుని ఉన్న గ్రామాల్లో అధికారులు అప్రమత్తమయ్యారు. ముఖ్యంగా ములకల్లంకలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. బొబ్బిల్లంక - ములకల్లంక మధ్య వరద ఉధృతంగా ఉంది. తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు, ఎంపీడీవో కె.రమేష్‌లు ఎప్పటికప్పుడు వరదపై ఆరాతీస్తూ, తమ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. వీఆర్వోలు, వీఆర్‌ఏలను రేవుల వద్ద ఉంచారు. పంచాయతీ సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉన్నారు. అత్యవసర పరిస్థితి ఎదురైతే పునరావాస కేంద్రాలు నెలకొల్పేందుకు రెండు జిల్లా పరిషత్ హైస్కూళ్లను ఎంపిక చేశారు. ఏజీఎల్‌బీ అధికారులు గోదావరి వరద ఉధృతిని బట్టి రేవుల వద్ద ఇసుక బస్తాలు వేయడానికి ఇసుక, సంచులను సిద్ధంగా ఉంచారు.

బోట్లపై రాకపోకలు

గతంలో గోదావరి వరద వచ్చే సమయంలో గ్రామాలకు చెందిన రెండు మర పడవలపై స్థానికులు రాకపోకలు జరిపేవారు. వరద ఎక్కువైనప్పుడు వీటిని అధికారులు ఏర్పాటు చేసేవారు. అయితే ఈ ఏడాది గోదావరి వరద ప్రారంభంలోనే ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సూచనల మేరకు రెండుబోటులను అధికారులు ఏర్పాటు చేశారు. ప్రజలు లైఫ్ జాకెట్లు ధరించి, బొబ్బిల్లంక - ములకల్లంక మధ్య బోటుపై రాకపోకలు జరుపుతు



సింగవరంలో ముంపునకు గురైన పామాయిల్, జామ తోటలు

న్నారు. పంచాయతీ కార్యదర్శి రజాక్ ములకల్లంకలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తున్నారు.

లంక భూముల్లోకి..

గోదావరి వరద ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, సీతానగరం, పురుషోత్తపట్నం, రఘుదేవపురం, కాటవరం తదితర గ్రామాల పరిధిలోని లంకభూముల్లో వేసిన దొండ, బీర పాదులు, కూరగాయల పంటలు, బొప్పాయి, పామాయిల్, జామ, అరటి తదితర సుమారు 300 ఎకరాలు ముంపులోకి వెళ్లాయి. పురుషోత్తపట్నంలో గోదావరిని ఆనుకుని **ఉన్న రోడ్డును తహసీల్దార్ సత్యనారాయణ రాజు ఆదేశాల మేరకు వీఆర్వో గోసాల చిన్న ఆధ్వర్యంలో రోడ్డును మూసివేశారు. ముందు జాగ్రత్త చర్యగా రోడ్డును మూసివేసినట్టు తహసీల్దార్ సత్యనారాయణ రాజు తెలిపారు.**

రేవుల్లో స్నానాలకు దిగొద్దు

మండలంలోని గోదావరి రేవుల్లో స్నానాలకు దిగవద్దని కోరుకొండ సీఐ ఉమామహేశ్వరరావు, తహసీల్దార్ ఎస్.సత్యనారాయణరాజు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని పలు రేవులను వారు సందర్శించారు. పురుషోత్తపట్నంలో ప్రజలకు అవగాహన కల్పించారు. గోదావరి వరదతో ఉధృతంగా ప్రవహిస్తోందని, నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. నదిలో పుల్లల కోసం, స్నానాల కోసం దిగవద్దని హెచ్చరించారు. పలు రేవుల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎస్సై చిరంజీవి, వీఆర్వో గోసాల చిన్నా, హెడ్‌కానిస్టేబుల్ గోవిందరాజులు, కానిస్టేబుళ్లు పాపినాయుడు, సుభాని, అవినాష్, దొర పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

బొబ్బిల్లంక రేవు నుంచి ములకల్లంకకు బయలు**దేరిన బోటుకు** ఆదివారం మధ్యాహ్నం **త్రుటిలో ప్రమాదం** తప్పింది. రేవు నుంచి **సుమారు 20 మీటర్లు** నదిలోకి వెళ్లిన తర్వాత **బోటుకు క్రింద ఉం**డే ఫ్యానుకు తుక్కు అడ్డుప**డటంతో ఈ సమస్య** ఏర్పడింది. దీంతో ఫ్యాన్ **తిరగడం ఆగిపోయి**, ఇంజిన్ మొరాయించింది. **దీంతో బోటు నదీ** ప్రవాహంలో కొట్టుకుపోయి, **బ్రిడ్జి రెండో స్తంభా**న్ని ఢీకొని ముందుకు వెళ్లింది. **ఈ ఘటనతో** బోటులోని ప్రయాణికులు **భయంతో కేకలు** వేశారు. ఒడ్డున ఉన్న రెండో **బోటు అక్కడకు వెళ్లి**, కొట్టుకుపోతున్న బోటును **తీసుకుని ఒడ్డుకు** వచ్చింది. అనంతరం ఫ్యాన్‌కు పట్టిన తుక్కును తొలగించి, తిరిగి ములకల్లంకకు ప్రయాణికులను చేర్చింది.



పురుషోత్తపట్నం వద్ద మూసివేసిన రోడ్డు



పురుషోత్తపట్నంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ ఉమామహేశ్వరరావు, తహసీల్దార్ సత్యనారాయణరాజు

రహదారులపై ఇష్టారాజ్యం

రంగంపేట: నిత్యం మనం వెళ్లే రోడ్డే అది. అయినా అడిగేవారు ఉండరు. కనీసం పట్టించుకోరు. ఫలితంగా కొందరికి ఇష్టారాజ్యం అయ్యింది. దమ్ము ట్రాక్టర్లతో ఎటువంటి రక్షణ లేకుండా నేరుగా రోడ్డుపైకి వస్తున్నారు. ఇలా రహదారులకు తూట్లు పొడుస్తున్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండడంతో రంగంపేట మండలంలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. పంట చేలలో దమ్ములు చేసిన తర్వాత ట్రాక్టర్లను నేరుగా దమ్ము చక్రాలతో రోడ్లపైకి తీసుకొస్తున్నారు. ఈ సమస్య ప్రధానంగా రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం, వడిశలేరు గ్రామాల్లో ఉంది. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతున్న ఈ వాహనాలతో రోడ్లు పొరలు, పొరలుగా లేచిపోతున్నాయి. ఈ దమ్ము ట్రాక్టర్ల ధాటికి రహదారిపై గోతులు పడటంతో రాకపోకలకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అయినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు.

ఇలా చేయాలి..

పంట పొలాల్లో తమ పనులు పూర్తయిన తర్వాత దమ్ము ట్రాక్టర్లను రోడ్లపై నడపాల్సి వస్తే దమ్ము చక్రాలకు ఇనుప బద్దెను అమర్చాలి. కానీ దానిని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఒక ఇనుప బద్దె ఏర్పాటుకు రూ. 3 వేల వరకూ ఖర్చవుతుంది. ట్రాక్టర్ యజమానులకు అది స్వల్ప మొత్తమే అయినా గాలికి వదిలేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రంగంపేటలో రోడ్డు పైకి వచ్చిన దమ్ము చక్రాల ట్రాక్టర్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- చక్రద్వారబంధంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రాజానగరం: రాష్ట్ర ప్రగతి, ప్రజాసంక్షేమమే ప్రధాన లక్ష్యంగా తమ ప్రభుత్వం పాలన సాగిస్తోందని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని చక్రద్వారబంధంలో సుమారు రూ.60 లక్షలతో నిర్మించిన కల్యాణ మండపానికి ఆదివారం నిర్వహించిన వాస్తు పూజ, హోమంలో ఆయన పాల్గొన్నారు. ఇదే ప్రాంగణంలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ, అరుంధతిపేటలలో రూ.10 లక్షలతో నిర్మించే రెండు కమ్యూనిటీ భవనాలకు శంకుస్థాపనలు చేశారు.

అదనపు నిధుల కేటాయింపు

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిర్మాణం చేపట్టిన ఈ కల్యాణ మండప నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అదనంగా రూ.40 లక్షలు కేటాయించి, సర్వాంగ సుందరంగా నిర్మాణ పనులు పూర్తి చేయించామన్నారు. పక్కనే ఖాళీ ప్రాంగణంలో వేంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు భోజనశాలను కూడా నిర్మిస్తే బాగుంటుందని సూచించారు. ఇందుకు దాతలు ఎవరైనా ముందుకు వస్తే ప్రభుత్వం నుంచి కూడా తగిన విధంగా సాయాన్ని అందించేందుకు కృషి చేస్తానన్నారు. సొంతింటి కలను సాకారం చేస్తూ ప్రభుత్వం అందిస్తున్న నివాస స్థలాలను మిగిలిపోయిన లబ్ధిదారులకు సొంత గ్రామ పరిధిలోనే అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజలకు ఏ సమస్యలు ఎదురైనా సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, కో కన్వీనర్ గండి నానిబాబు, మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, అనదాస సాయిరామ్, మార్గాని శ్రీను, వాడ్రేవు శ్రీనివాసరావు, కామేశ్వరరావు, నాగవరపు త్రిమూర్తులు, వేమగిరి కృష్ణ, తాతబ్బాయి, ఎంవి కృష్ణప్రసాద్, నాగ మునేశ్వరరావు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

అధిక దిగుబడికి బాటలేద్దాం

- కాలిబాటలతో సస్యరక్షణ
- సాగులో ఖర్చు ఆదా
- నియోజకవర్గంలో 29,943 ఎకరాల్లో నాట్లు

పెదపూడి: సాగులో సస్యరక్షణ చర్యలు పాటిస్తే సత్ఫలితాలు సాధించవచ్చు.. ఆశించిన దిగుబడులూ పొందవచ్చు.. వరి సాగులో కాలిబాటలతో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. పైరుకు చీడపీడల సమస్య తగ్గుతుంది. పెట్టుబడి తగ్గి దిగుబడి పెరుగుతుంది. చాలామంది రైతులు కాలిబాటలు వేయడానికి ఆలోచిస్తుంటారు. దీనిని అనవసర వ్యయంగా భావిస్తుంటారు. ఎకరా పొలంలో కాలిబాటలు వేయడానికి సుమారు రూ.వెయ్యి ఖర్చవుతుంది. దిగుబడి సుమారు నాలుగు బస్తాల వరకూ పెరుగుతోంది. అనపర్తి నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో 46,067 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఇందులో అనపర్తి మండలంలో 9,550 ఎకరాలు, బిక్కవోలులో 15,741, పెదపూడిలో 18 వేలు, రంగంపేట మండలంలో 2,776 ఎకరాల్లో సాగు జరుగుతోంది. ఇప్పటి వరకూ సుమారు 29,943 ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయి. రైతులు తప్పనిసరిగా వరి చేలల్లో కాలిబాటలు వేసుకోవాలని, తద్వారా ఎన్నో మంచి ఫలితాలు ఉంటాయని మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్ సూచిస్తున్నారు.

పాటించాల్సిన విధానం

కాలిబాటలు వేసుకునే సమయంలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. పొడవైన ప్లాస్టిక్ తాడును గట్టుకు ఒకవైపు నుంచి రెండో వైపునకు సాగదీసి కట్టాలి. తాడు వెంబడి 12 సెంటీమీటర్ల వెడల్పున వరినాట్లు తొలగించి పక్కనే పలుచగా ఉన్నచోట నాటుకోవాలి. చేను గట్టు పక్క నుంచి అడుగు దూరంలో కాటిబాట వేసి అక్కడి నుంచి ప్రతి రెండు మీటర్ల దూరంలో ఒక కాలిబాట వేయాలి. కొందరు రైతులు ప్రతి 6 నుంచి 7 మీటర్లకు ఒక కాలిబాట వేస్తుంటారు. దీనివల్ల ప్రయోజనం ఉండదు. ముందు నాట్లు వేసిన రైతులు గట్లకు ఇరువైపులా తాడు కట్టి మార్క్ చేసిన చోట ఉన్న మొక్కలను తీసి వేసి కాలిబాట వేస్తుంటారు. వెదజల్లే పద్ధతిలో పైరు ఎదుగుతున్న సమయంలో 15 నుంచి 20 రోజుల వ్యవధిలో 20 సెంటీమీటర్ల వెడల్పులో వరి నాట్లు తొలగించి కాలిబాట వేసుకోవచ్చు.



పుట్టకొండలో కాలిబాటలు వేసిన పొలం

ఇవీ ప్రయోజనాలు

కాలిబాటతో పైరు మొదళ్ల వరకూ వెలుతురు, గాలి, ఎండ సమృద్ధిగా తగులుతుంది. దీంతో పైరు ఆరోగ్యవంతంగా ఎదుగుతుంది. చీడపీడల బెడద కొంతవరకూ తగ్గుతుంది. కాలిబాట మార్గంలోకెళ్లి కలుపు మొక్కలు తొలగించడానికి, మందులు చల్లుకోవడానికి వీలవుతుంది. తెగుళ్ల గుర్తించి సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి, ఎలుకల నివారణకు ఉపయోగపడుతుంది. తుపానులు, భారీ వర్షాలు వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పుడు పంట చేల్లో మొక్కల్లో కిరణజన్య సంయోగక్రియ సమర్థవంతంగా జరిగి దిగుబడి పెరుగుతుంది. పైరులో చీడపీడల ఉధృతిని అతి సమీపం నుంచి గమనించి, దానికి అనుగుణంగా సకాలంలో సస్యరక్షణ తీసుకునే వీలు కలుగుతుంది.

సాగు సులువు



ప్రతి సీజన్‌లో వరిలో కాలిబాట వేసి సాగు చేస్తున్నాను. సాగు చేయడం సులభంగా ఉంటుంది. పైరుకు తెగుళ్ల, చీడపీడల ఆశించినా గుర్తించే వీలుంటుంది. పురుగు మందులు, ఎరువులు వేయడానికి ఉపయోగపడుతుంది. ఈ సార్వాలో కూడా పొలంలో కాలిబాటలు వేవాను.

– **తోటకూర సత్యనారాయణ**, రైతు, కరకుదురు

ఎంతో ప్రయోజనకరం



కాలిబాటలతో దిగుబడి రెండు, మూడు బస్తాలు అదనంగా వస్తుంది. అంతేకాకుండా సస్యరక్షణ చర్యలు తీసుకోవడం సులభమవుతుంది. వ్యవసాయ నిపుణుల సూచనల మేరకు పొలంలో కాలిబాటలు వేసుకుంటే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

– **టీవీఆర్ మణిదీప్**, వ్యవసాయ అధికారి, పెదపూడి మండలం

మణిపూర్ ఘటనలకు నిరసనగా శాంతి ర్యాలీ

మధురపూడి: మణిపూర్ రాష్ట్రంలో మారణహోమం ఆగాలని, శాంతి ఏర్పడాలని కోరుకుంటూ ఆదివారం క్రైస్తవులు ర్యాలీ నిర్వహించారు. మండలంలోని అన్ని క్రైస్తవ సంఘాల సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పశ్చిమగానుగూడెంలోని సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి నుంచి ప్రారంభమైన ర్యాలీ కోరుకొండ వరకూ జరిగింది. మణిపూర్‌లో శాంతి ఏర్పడాలని, క్రైస్తవులపై దాడులు అరికట్టాలని నినాదాలు చేశారు. బస్టాండ్‌లో ఏఐసీసీ జిల్లా అధ్యక్షులు కోడి మోజెస్ బాబు, ఎంపీటీసీ గొల్లపల్లి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మణిపూర్‌లో చర్చిలను దగ్ధం చేయడం దారుణమన్నారు. క్రైస్తవులకు రక్షణ కల్పించడం, మణిపూర్‌లో మారణహోమాన్ని నిలువరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు కృపావిల్సన్, లాజరస్, అలెగ్జాండర్, రాయుడు జోయల్ రాజు, పీఎస్ఆర్ కాలేజీ ప్రిన్సిపల్ థామస్, సాల్మన్ రాజు, శాంతి రాజు, మున్నా మోజెస్ పాల్గొన్నారు.

చర్చిల్లో ప్రార్థనలు

మణిపూర్‌లో శాంతి నెలకొనాలంటూ చర్చిల్లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక ఎస్సార్ నగర్‌లోని ఆర్‌సీఎం చర్చిలో రెవరెండ్ ఫాదర్ ఆంటోనీ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. ఉపదేశి బెల్లపు డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.



కోరుకొండలో శాంతి ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు